క్లుప్తంగా

భవిత కేంద్రం పరిశీలన



పిల్లలతో మాట్లాడుతున్న అధికారులు

చంద్రగిరి: స్థానిక చంద్రగిరి ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణలోని ప్రత్యేక ప్రతిభావంతుల కేంద్రాన్ని (భవిత) జిల్లా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓ–2 భాస్కర్‌బాబు బుధవారం పరిశీలించారు. శిక్షణ పొందుతున్న పిల్లలను పలకరించి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. భవిత కేంద్రంలో పిల్లలకు అందుతున్న ఉపకరణాలు, అలవెన్సులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిత కేంద్రంలో ప్రత్యేక ప్రతిభావంతులకు అనేక రకాల సేవలను అందిస్తున్నామన్నారు. ఇందులో స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, ప్రత్యేక విద్య వంటి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, విద్యార్థుల తలిదండ్రులను వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది వెంకట రాజేశ్వరి, శ్యామల దేవి, ప్రత్యేక ప్రతిభావంతులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రామచంద్రాపురం: మండలంలోని పరమాల గ్రామంలో బుధవారం జరుగుతున్న గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఈ నేపథ్యంలో ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ జాతరలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తిరుపతి(అలిపిరి): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం టీటీడీ ఈఓ జె.శ్యామలరావును టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల యూనియన్ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని కోరారు. టీటీడీ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు ఆంజనేయులు, మునికుమార్, చంద్రయ్య, వెంకటమణి, నేతలు రంగయ్య, జగ్గయ్య, మనోజ్ కుమార్, వెంకన్న పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంఈఓ

రామచంద్రాపురం: వర్షాలు విస్తారంగా పడుతున్న నేపథ్యంలో అంటువ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఉషారాణి అన్నారు. బుధవారం అనుప్పల్లి, బొప్పరాజుపల్లి, నెత్తకుప్పం, నూతిగుంటపల్లి, సూరావారిపల్లి, కుప్పంబాదూరు గ్రామాల్లోని పాఠశాలలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీటి ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్ వేసి క్లోరినేషన్ చేయాలని చెప్పారు. ఈక్రమంలోనే పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యతను, తాగునీటి ట్యాంకులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ మార్కొండయ్యనాయుడు, ఆర్ఐ కృష్ణమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌రాజ్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం చిట్టెచెర్ల గ్రామ సర్పంచ్ నాగచెంగమనాయుడు సెలవు రద్దు చేసుకున్నట్లు ఆయన బుధవారం తెలిపారు. ఈ మేరకు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి నుంచి అధికారికంగా సెలవు రద్దు చేసుకున్న ఉత్తర్వులను ఎంపీడీఓకు అందజేసినట్టు తెలిపారు. సెలవుపై వెళ్లడంతో ఉప సర్పంచ్ ఎం.రోజారాణికి బాధ్య తలు అప్పగించామన్నారు. తన ఆరోగ్యం మెరుగుపడడంతో తిరిగి బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు ఆయన చెప్పారు.

38 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం తాగి వాహనా లు నడుపుతున్న 15 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐలు సుబ్బారెడ్డి, చిన్నపెద్దయ్య, మహమ్మద్ బాబా, శ్రీరాములు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో తనిఖీ లు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. అలాగే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 23 మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారికి రూ.4,600 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు



తిరుపతి: ర్యాలీలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం–అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా మాదకద్రవ్యాల వినియోగంతో లక్షల మంది చనిపోతున్నారని, అలాగే ఆర్థికంగా చితికి వారి కుటుంబసభ్యులు రోడ్డున పడుతున్నారని తెలిపారు. మాదకద్రవ్యాలు శరీరంలోని అన్ని అవయవాలపై, మానసిక స్థితిపై దుష్ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు యువతపై ఉందని, యువత మాదక ద్రవ్యాలకు బానిసలై తమ జీవితాలనే కాకుండా దేశభవిష్యత్తును ప్రమాదంలోకి తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల నుంచి ప్రపంచాన్ని విముక్తి చేయాలన్న దృఢసంకల్పంతో, అలాగే ఈ లక్ష్య సాధనకు సహాయ సహకార చర్యలను బలోపేతం చేసేందుకు ప్రతిఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అనంతరం విద్యార్థులతో డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుదామని ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు మాదకద్రవ్యాల వాడకంతో కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ ఆ కళాశాల ఎన్‌సీసీ,ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ప్రసన్నలక్ష్మి, డాక్టర్ సీఎల్.చెన్నారెడ్డి, చంద్రికాబాయి, కృష్ణకిశోర్, లోకేష్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ప్రకాష్‌బాబు

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థినులు బుధవారం వర్సిటీలో భారీ ర్యాలీ నిర్వహించారు. రిజిస్ట్రార్ ఎన్.రజిని పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు లోనుకాకుండా మంచి అలవాట్లతో ఆరోగ్యవంతగా జీవించి నవసమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని సూచించారు. మాదకదవ్రాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫె సర్ విద్యావతి, ప్రొగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహిళా యూనివర్సిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

టీటీడీ ఈఓను కలిసిన ఉద్యోగులు



ఈఓను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఈఓగా శ్యామలరావు బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలోని కార్యాలయానికి బుధవారం వచ్చారు. ఈ సందర్భంగా టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంకు ఉపాధ్యక్షుడు, టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్, ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీహరి ఆధ్వర్యంలో ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అసోసియేషన్ కోశాధికారి రేఖ, సభ్యులు వంకీపురం పవన్, మణికంఠ, అశోక్‌కుమార్, విశ్వనాథం, ప్రియవర్ధన్ బాబు, ధరణికుమార్, వెంకటేష్, సారిక, అంకయ్య, ఈశ్వర్ నాయక్, మస్తాన్‌రావు, హరిహరన్, నాగరాజు, కల్యాణకట్ట ఉద్యోగుల సంఘం నేతలు పాల్గొన్నారు.

బడికి పోదాం..భవిష్యత్తు మార్చుకుందాం



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

చంద్రగిరి: చదవాల్సిన వయస్సులో కూలీ పనులు చేసుకోకుండా..విద్యను అభ్యసించి మన భవిష్యత్తును మనమే మార్చుకుందామని ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్‌బాబు అన్నారు. బుధవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కొత్తపేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బడిఈడు పిల్లలు బడిలో ఉండాలంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. వారు మాట్లాడుతూ బడికి వెళ్లా అర్ధాంతరంగా బడి మానేసిన గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను గుర్తించి, తిరిగి వారిని బడిలో చేర్పించడమే కార్యక్రమ ముఖ్యఉద్దేశమన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా చేయాలని ఆమె సూచించారు.

నేడు గ్లకోమా ఉచిత వైద్యశిబిరం

తిరుపతి తుడా: స్థానిక శ్రీ సాయిసుధా కంటి ఆస్పత్రిలో గురువారం గ్లకోమా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆస్పత్రి అధినేత్రి డాక్టర్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

తిరుపతి కల్చరల్: చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలం, మారేపల్లి గ్రామంలో దళితులపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రికెట్ ఆడుతున్న దళిత యువకులపై వేణుగోపాలపురం, వావిల్‌చెరువుచేనుకు చెందిన అగ్రవర్ణాలు కరెంట్ పోల్‌కు కట్టివేసి దళిత యువతను దాడి చేసి గాయపరచడం దుర్మార్గమన్నారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నేతలు శాంతి యాదవ్, వెంకటేష్ గౌడ్, భానుప్రకాష్, నాగరాజు, నవీన్‌భాస్కర్ పాల్గొన్నారు.

పామాయిల్ తోటల పెంపకంతో ఆదాయం

ఏర్పేడు: పామాయిల్ తోటల పెంపకంతో రైతులు మంచి ఆదాయాన్ని పొందవచ్చని త్రీఎఫ్ ఆయిల్‌ఫామ్ కంపెనీ ఏజీఎం మురళి అన్నారు. బుధవారం మండలంలోని సరస్వతికండ్రిగలో పామాయిల్ తోటల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగించిందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉద్యానశాఖ సూచనల మేరకు పామాయిల్ తోటల పెంపకం చేపడితే దిగుబడులు పెరిగి ఆదాయం చేకూరుతుందని వివరించారు. తోటల పెంపకం, ప్రభుత్వ రాయితీలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో త్రీఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ క్లస్టర్ మేనేజర్ రాజేష్, ఏర్పేడు క్లస్టర్ మేనేజర్ గురునాథం, రైతులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న టీటీడీ ఈఓ



ధ్వజస్తంభానికి మొక్కుతున్న ఈఓ దంపతులు

చంద్రగిరి(తిరుచానూరు): టీటీడీ ఈఓ జె.శ్యామలరావు బాధ్యతలు స్వీకరించిన అనంతరం బుధవారం తొలిసారిగా తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద జేఈఓ వీరబ్రహ్మం ఈఓకు స్వాగతం పలికారు. ధ్వజస్తంభానికి మొక్కుకున్న అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వాద మండపంలో ఆయనకు అర్చకులు వేద ఆశీర్వాదం చేశారు. తరువాత జేఈఓ వీరబ్రహ్మం అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబు స్వామి పాల్గొన్నారు.

పేదల జోలికొస్తే ఊరుకోం



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నేతలు, వీధి వర్తక వ్యాపారులు



కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నేతలు

- వీధి వ్యాపారులకు ఏఐటీయూసీ అండగా ఉంటుంది
- ధర్నాలో సీపీఐ, ఏఐటీయూసీ నేతలు

తిరుపతి కల్చరల్: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో తెలుగు దేశం పార్టీ నేతల దందాలు ఎక్కువయ్యాయని, వీధి వర్తక వ్యాపారుల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ హెచ్చరించారు. ఆక్రమణల పేరుతో వీధి వ్యాపారుల దుకాణాల తొలగింపును వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ అనుబంధమైన వీధి వర్తక వ్యాపార కార్మిక ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ నేడు టీడీపీ నేతలు తిరుపతి నియోజకవర్గాన్ని ప్రాంతాలుగా విభజించుకొని నాయకుడికి ఒక్కో రకమైన దందాకు తెరలేపారని వీరి ఆశలతో చిరు వ్యాపారులు భయంతో అల్లాడిపోతున్నారన్నారు. టీడీపీ నేతలకు మున్సిపల్ అధికారులు కూడా అండగా ఉంటున్నారని అన్నారు. జనసేన పార్టీ ఎమ్మెల్యే కదా అధికారం వారిది ఆదాయం మనది అన్న రీతిలో తెలుగుదేశం పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. అవసరమైతే దశల వారీ పోరాటానికి ఏఐటీయూసీ సన్నద్ధమవుతుందన్నారు. ముఖ్యమంత్రి దాకా ఈ విషయాన్ని తీసుకెళ్లడానికి, సీఎంకు వినతిపత్రం సమర్పించడానికి ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఐ జిల్లా నేత చిన్నం పెంచలయ్య, శివ, కేవై.రాజా, గోవిందస్వామి, శ్రీనివాసులు, పద్మనాభరెడ్డి, మంజుల, మహేంద్ర, నరసింహులు, వీధి వర్తక వ్యాపారులు పాల్గొన్నారు.

వ్యాపారస్తులకు న్యాయం చేస్తాం.. కమిషనర్ అదితిసింగ్

వీధి వ్యాపారుల ధర్నా వద్దకు చేరుకున్న తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్‌కు ఏఐటీయూసీ, సీపీఐ నేతలు వినతి పత్రం సమర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధి వర్తక వ్యాపారులను ఏ ఒక్కరినీ తొలగించమని అవసరమైన సహాయ సహకారాలు అందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

డయేరియా నియంత్రణకు చర్యలు



నీటి సాంద్రత పరీక్షను పరిశీలిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్

తిరుపతి తుడా: నగరంలో డయేరియా ప్రబలకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం రఘునాథరెడ్డి కాలనీ, ఎస్టీవీ నగర్, రైతుబజార్ పక్కనున్న వాటర్ ట్యాంక్, సీతమ్మనగర్ ఏరియా, రిజర్వాయర్ కాలనీ, చిన్నబజార్ వీధి, గాంధీ రోడ్డు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. నీటి కొళాయిలు, వాటర్ ట్యాంకులు, సంపులను, వాటర్ సప్లై లేన్లను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. డయేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ వాటర్ సోర్స్‌లో వెంటనే నీటి కాలుష్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కాలుష్యం నిర్ధారణ అయితే వెంటనే నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ ట్యాంకులను పూర్తిగా తనిఖీ చేసి శుభ్రంగా ఉండేటట్లు చూడాలని, క్లోరినేషన్ తప్పనిసరిగా చేయించాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ ద్వారా సరఫరా చేసే నీటి విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి నాణ్యతపై ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ తిరుమాలిక మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈలు సంజీవ్ కుమార్, మహేష్, తేజశ్వి పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల చేయండి



ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గత ఏడాది అక్టోబర్ నెలలో నిర్వహించిన డిగ్రీ బీకామ్ 3వ సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలను వెంటనే విడుదల చేయాలని ఏఐడీఎస్ఓ విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు. బుధవారం వర్సిటీలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ చంద్రయ్యకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫలితాలు సరైన సమయానికి విడుదల చేయకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా డిగ్రీ 3వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు జనవరి మాసంలో జరిగితే ఇంతవరకు ఫలితాలు విడుదల కాలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫలితాలను వెంటనే విడదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నగర అధ్యక్షుడు వి.వెంకట సుబ్బయ్య, నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీసుందరరాజస్వామి మహోత్సవాలు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీసుందరరాజస్వామివారి అవతార మహోత్సవాలు గురువారం నుంచి శనివారం వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మూడు రోజులపాటు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో శ్రీ సుందరరాజ స్వామివారికి వైభవంగా అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 5.45 నుంచి 6.15 గంటల వరకు శ్రీసుందరరాజస్వామివారికి ఊంజల్‌సేవ జరుగనుంది. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు వాహనసేవ నిర్వహిస్తారు. శ్రీసుందరరాజస్వామి మొదటి రోజు పెద్దశేష వాహనం, రెండో రోజు హనుమంత వాహనం, చివరిరోజు గరుడ వాహనంపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఉత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు శ్రీపద్మావతీ అమ్మవారి ఊంజల్ సేవను రద్దు చేస్తున్నట్లు టీటీడీ అధికారులు ప్రకటనలో తెలిపారు.

టీటీడీ పరిపాలనా భవనంలో పూజలు



ఈఓను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న జేఈఓలు

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో ఈఓ జె.శ్యామలరావు కార్యాలయంలో బుధవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి స్వాగతం పలికారు. ఈఓను వేదపండితులు ఆశీర్వదించారు. అనంతరం టీటీడీ అధికారులు, ఉద్యోగులు ఈఓను మర్యాదపూర్వకంగా కలిశారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు తనీషజాయ్



తనీషజాయ్‌ని అభినందిస్తున్న స్కూల్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: లిటిల్ ఏంజెల్స్ స్కూల్లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి టి.తనీషజాయ్ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ఛైర్ పర్సన్ రమాదేవి తెలిపారు. విజయవాడలో ఈనెల 24న జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 13 గర్ల్స్ కేటగిరి ఆర్చరీ పోటీల్లో విద్యార్థి అత్యుత్తమ ప్రతిభతో జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని ఆమె ఈసందర్భంగా పేర్కొన్నారు. అనంతరం విద్యార్థిని తనీషజాయ్ మాట్లాడుతూ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కోచ్ టి.ధనంజేయులు, ఛైర్ పర్సన్ రమాదేవి, ప్రిన్సిపల్ పద్మశ్రీ, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్ శ్వేతారెడ్డి, విద్యార్థిని తనీషజాయ్‌ని అభినందించారు.

డ్రోన్‌తో కూలీల సమస్యకు చెక్



డ్రోన్‌తో మందు పిచికారీపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రేణిగుంట: వ్యవసాయంలో డ్రోన్లను వినియోగించడం ద్వారా కూలీల సమస్యను అధిగమించవచ్చని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఏడీ రత్నప్రసాద్ అన్నారు. చిత్తూరు ఆత్మ సహకారంతో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం మండలంలోని కరకంబాడి పంచాయతీ గొల్లపల్లిలో వరి పంటలో డ్రోన్‌తో మందు పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాముకుమార్ పాల్గొని డ్రోన్లతో క్రిమి సంహారక మందుల పిచికారీ చేసే విధానం, లాభాలను వివరించారు. డ్రోన్‌తో ప్రయోగాత్మకంగా ఓ రైతు పొలంలో మందును పిచికారీ చేసి చూపించారు. ఆయన మాట్లాడుతూ కేవలం ఆరు నుంచి 8 నిమిషాల వ్యవధిలోనే 10 లీటర్ల నీటితో ఒక ఎకరా పంటకు పిచికారీ చేయవచ్చన్నారు. దీంతో కూలీల సమస్య అధిగమించడమే కాకుండా క్రిమిసంహారక మందు మోతాదు 20నుంచి 25 శాతం తగ్గుతుందన్నారు. పురుగు మందు ప్రభావం కూడా సాధారణ పద్ధతి కంటే ఎక్కువ ఫలితాలను ఇస్తుందని చెప్పారు. దీనికితోడు సమయం ఆదా అవుతుందని తెలిపారు. గ్రామాల్లో రైతులు గ్రూపులుగా ఏర్పడి డ్రోన్‌లను తెచ్చుకుని వాడుకుంటే లాభసాటిగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వేణు, రైతులు పాల్గొన్నారు.